క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం పుష్యమాసం ఉత్తరాషాడ నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

యద్దనపూడి: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి , ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ప్రమీలా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 10న ఉదయం 10 గంటలకు 5వ తరగతికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటర్‌మీడియెట్‌కు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు ఉంటాయని వెల్లడించారు.

సొసైటీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన పాలకవర్గం

అద్దంకి: నాగులపాడు సొసైటీకి నూతనంగా నియమితులైన సంఘ అధ్యక్షుడు, పాలకవర్గ సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వారిలో అధ్యక్షుడు మానికొండ నాగరాజు, సభ్యులు వెంగలశెట్టి వెంకటేశ్వర్లు, భీమనాథం రాఘవరెడ్డి ఉన్నారు. తమపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి రైతులకు మేలు జరిగేలా చూస్తామని అధ్యక్షుడు నాగరాజు చెప్పారు. సొసైటీ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రమణమూర్తి దంపతులకు సత్కారం



రమణమూర్తి దంపతులను సత్కరిస్తున్న పాఠశాల సిబ్బంది

యద్దనపూడి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ సేవలందించినందుకు ప్రశంసపత్రాన్ని అందుకున్న పూనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ రికార్డు అసిస్టెంట్ దామరాజు లీలా వెంకటరమణమూర్తి దంపతులకు పాఠశాల సిబ్బంది బుధవారం సత్కారం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏఎం శ్రీనివాసరావు వారిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు.

వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న గంగా భవానీ కుమార్

అద్దంకి: అరిగెల హైమావతి అనారోగ్యంతో ఒంగోలులోని వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఆమెకు పింఛన్ అవసరం కావడంతో వలంటీర్ మేదర గంగాభవానీ కుమార్ బుధవారం ఒంగోలు వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేశాడు.

బియ్యం బస్తాలు స్వాధీనం



మేదరమెట్లలో స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలున్న ఆటోతో అధికారులు

మేదరమెట్ల: అక్రమంగా తరలిస్తున్న బియ్యం బస్తాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ సమీపంలో బుధవారం తెల్లవారిజామున పట్టుకున్నారు. మేదరమెట్ల పోలీసులు తెలిపిన సమాచారం మేరకు తిమ్మనపాలెం కుబేర హోటల్ సమీపంలో అక్రమంగా ఆటోలో బియ్యం బస్తాలను తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి 34.50 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి నాలుగు చక్రాల ఆటోతో పాటు 69 బియ్యం బస్తాలను మేదరమెట్ల పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

సీఎం జగన్‌కు తోడుగా నిలవాలి



వైఎస్సార్ ఆసరా చెక్‌లను మహిళలకు పంపిణీ చేస్తున్న ఆమంచి



సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లను లబ్ధిదారులకు అందిస్తున్న ఆమంచి

- నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్
- మహిళా గ్రూపులకు రూ. 8.39 కోట్ల చెక్కుల పంపిణీ

చినగంజాం: ఎన్నికల హామీలో ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రంలో మహిళలందరినీ రుణ విముక్తులను చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మహిళలంతా తోడుగా నిలవాలని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో ఆర్డినేటర్ లక్ష్మణాచారి అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలో గత 25 సంవత్సరాలుగా మహిళా స్వయం సంఘాలు వెలుగు, ఇందిరా క్రాంతి పథం, ప్రస్తుతం వైఎస్సార్ క్రాంతి పథం పేరుతో విస్తృత స్థాయిలో కొనసాగుతున్నాయని చెప్పారు. మొదట కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన పథకం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టణ ప్రాంతాల్లో సైతం మెప్మా పేరుతో ఏర్పాటు చేసి విజయవంతం నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు నైపుణ్యాన్ని పెంచుకొని తాము సొంతంగా పారిశ్రామిక స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. నియోజకవర్గంలో వ్యవసాయ పంటలు, ఉద్యాన వన పంటలు ఉండగా చినగంజాం మండలంలో ఉప్పు కొఠారులు, ఆక్వా పరిశ్రమ, వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయని మహిళలు ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రుణాలు అందిపుచ్చుకొని బలమైన వ్యవస్థగా తయారు కావాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు రుణభారం తగ్గించాలనే సంకల్పంతో రాష్ట్రంలో 25 వేల కోట్ల రూపాయిలు మహిళలకు అందజేశారన్నారు.

అనంతరం రూ. 8.39 కోట్ల మెగా చెక్‌ను అందజేశారు. అనంతరం మహిళలు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ యాటీ వరప్రసాదరావు, ఏపీఎం అంజిబాబు, వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ పాదర్తి ప్రకాష్, బీసీ సెల్ కన్వీనర్ వీవీఆర్ ప్రసాద్, సంతరావూరు సొసైటీ ప్రెసిడెంట్ కేవీ సుబ్బారావు చౌదరి, కేవీ రెడ్డి, మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

తహసీల్దార్ల నియామకం



పర్చూరు తహసీల్దార్ సుబ్బయ్య



చినగంజాం తహసీల్దార్ ఫణీంద్ర బాబుకు అభినందనలు తెలియజేస్తున్న సిబ్బంది

చినగంజాం: మండల తహసీల్దార్‌గా జీవీఎస్ ఫణీంద్ర బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన పి. పార్వతి గుంటూరు జిల్లాకు సాధారణ ఎన్నికల నేపథ్యంలో బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఫణీంద్ర బాబు చేరారు. నూతన తహసీల్దార్‌కు కార్యాలయ సిబ్బంది శాలువా కప్పి పూలబొకేను అందజేసి ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

పర్చూరు (చినగంజాం): పర్చూరు మండల తహసీల్దార్‌గా సీహెచ్ సుబ్బయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన బదిలీల్లో భాగంగా నెల్లూరు నుంచి పర్చూరు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ప్రమాద బాధితులకు అండగా ఉండాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, వైద్యులు

అద్దంకి: ప్రమాద బాధితులకు సహాయం చేయడం మన కనీస కర్తవ్యమని బాపట్ల మోటర్ వైకిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమారి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బాపట్ల జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని సీహెచ్‌సీ (సమాజిక ఆరోగ్య కేంద్రం)లో బుధవారం గుడ్ సమారిటన్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రసన్న కుమారి మాట్లాడుతూ ప్రమాద సమయంలో క్షతగాత్రులకు మన మంచి సహాయకుని (గుడ్ సమారిటన్)గా ఉండాలన్నారు. ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్)లోపు బాధితులను వైద్యశాలకు తరలిస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. అలా క్షతగాత్రులను వైద్యశాలలకు తరలించే వారికి మోటర్ వెహికిల్ యాక్టు 1986 లోని సెక్షన్ 134ఏ ద్వారా చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తామని వివరించారు. ప్రతి ఒక్కరూ దారిన వెళ్లే సమయంలో యాక్సిడెంట్ జరిగి ఎవరైనా క్షతగాత్రులు కనిపిస్తే భయపడకుండా వారిని దగ్గరలో ఉన్న వైద్యశాలకు తరలించి ప్రాణాలు కాపాడాలని చెప్పారు. తరువాత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ శరత్‌కుమార్, వెంకట్ కిరణ్, ప్రదీప్‌కుమార్, రేడియలజిస్ట్ రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ క్రీడాకారుల ప్రతిభ



విజేత క్రీడాకారులతో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: జాతీయ స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విన్నర్స్‌గా నిలిచారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణరావు బుధవారం తెలిపారు. ఇటీవల గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్శిటీలో విజ్ఞాన్ మహోత్సవ్–2024 (నేషనల్ యాత్ పెస్టివల్) సందర్భంగా జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎనిమిది యూనివర్శిటీలు, 50 కళాశాలల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొన్నాయని తెలిపారు. ఫైనల్ పోటీల్లో విజ్ఞాన్ యూనివర్శిటీ జట్లను ఓడించి సెయింట్ ఆన్స్ జట్టు విన్నర్స్‌గా నిలిచారని వ్యాయామ ఉపాధ్యాయుడు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. విన్నర్స్‌గా నిలిచిన జట్టుకి రూ.30 వేల బహుమతి, ప్రతి కీడాకారుడికి వ్యక్తిగత మెడల్స్ అందజేసినట్లు తెలిపారు. క్రీడాకారులను ప్రిన్సిపాల్ ఎం. వేణుగోపాలరావు, మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన



తిమిడెదపాడులో ఎండీఎంను పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఎంఈఓ ఎంవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని తిమిడెదపాడు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని రకాల రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం మరింత పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే పథకాలపై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలన్నారు. కొడవలివారిపాలెం స్కూల్ కాంప్లెక్స్ కాంప్లెక్స్ చైర్మన్, ఉపాధ్యాయులు, కుకింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం పేరిరెడ్డి

ఇంకొల్లు (చినగంజాం): విద్యార్థులు చిన్నతనం నుంచే ఆరోగ్య సూత్రాలు పాటించాలని మార్టూరు రోటరీ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు తాళ్ళూరి సాంబశివరావు అన్నారు. ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో మార్టూరు రోటరీ ఇంటర్నేషనల్ వారు విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భగా రోటరీ క్లబ్ మార్టూరు శాఖ అధ్యక్షుడు సాంబశివరావు మాట్లాడుతూ పాఠశాలకు రూ. 12.59 లక్షలతో హ్యాండ్ వాష్, బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్స్, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకొని పరిశుభ్రతను పాటిస్తూ ఆరోగ్య సూత్రాలను పాటించాలని సూచించారు. ఆరోగ్యమే మహా భాగ్యం అనే సూత్రం చిన్నతనం నుంచి పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి సాలిమట్ల జయరావు, తన గజల్ పాటలతో వివరించారు. రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు జాష్టి సాంబశివరావు, రోటరీ సభ్యులు దొడ్డా మహేందర్, మాదాల సాంబశివరావు పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ రమాబాయి



రమాబాయికి నివాళి అర్పిస్తున్న పెద్దలు

అద్దంకి: ఆదర్శ మహిళ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేశ్ అన్నారు. స్థానిక బంగ్లా రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె జయంతి కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి నివాళి అర్పించారు. రిటైర్డ్ ఆర్జేడీ యూ దేవపాలన మాట్లాడుతూ రమాబాయి ఆదర్శ జీవి అని అందుకే అంబేడ్కర్ గొప్ప చదువులు చదవగలిగారని చెప్పారు. చెన్నుపల్లి నాగేశ్వరరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, మన్నం త్రిమూర్తులు, అన్నంనేని వెంకట్రావు, చెన్నుపాటి రామాంజనేయులు, బాబూరావు, తెలగతోటి రాధా కృష్ణమూర్తి, జోషఫ్, మంచు హనుమంతరావు, జె. ప్రభాకరరావు పాల్గొన్నారు.

విద్యుత్ అపరాధ రుసుం రూ.3,80,000 వసూలు

చీరాల అర్బన్: పట్టణంలోని డి–2 సెక్షన్ పరిధిలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చీరాల డివిజన్ ఈఈ కె.జాన్ థామస్ ఆధ్వర్యంలో సిబ్బంది 34 బృందాలుగా విడిపోయి మొత్తం 1600 సరీ్వసులను తనిఖీ చేశారు. తనిఖీల్లో అదనంగా లోడ్ వాడుతున్న 132 సర్వీసులను గుర్తించి వారికి రూ.3,80,000 అపరాధ రుసుం విధించారు. ఈఈ కె.జాన్ థామస్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అదనంగా విద్యుత్‌ను వాడడం చట్టరీత్యా నేరమన్నారు. కేటాయించిన విద్యుత్ లోడ్ కంటే ఎక్కువ వాడడం నేరమని చెప్పారు. తనిఖీల్లో విద్యుత్ విజిలెన్స్ డీఈ శ్రీనివాసరావు, చీరాల, వేటపాలెం, పర్చూరు డీఈలు టి.శ్రీనివాసరావు, జె.శ్రీనివాసులు, రమేష్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు



దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్

పర్చూరు (చినగంజాం): పర్చూరులో ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రణీత్ పలు వ్యాపార సంస్థలపై దాడులు నిర్వహించారు. బుధవారం వివిధ స్థానిక శీతల పానీయాల విక్రయ కేంద్రాలు, వ్యాపార దుకాణాలు, సూపర్ మార్కెట్‌లో సోదాలు నిర్వహించారు. కాలం చెల్లిన వస్తువులను గుర్తించి వాటిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోల్‌సేల్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని షాపుల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి సీజ్ చేస్తామని, 14 రోజుల వ్యవధిలో మొత్తం చక్కబెట్టుకోవాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని నోటీసులు జారీ చేశారు.

తీరం వద్ద గుర్తు తెలియని మృతదేహం



వేటపాలెం: రామాపురం సముద్రతీరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం గుర్తించారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆల్‌బెండజోల్‌తో రక్తహీనత నివారణ



ఎంపీడీవోకి మాత్రలు అందజేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

బల్లికురవ: రక్తహీనత లేకుండా విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండేందుకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్ సూచించారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హనుమారెడ్డికి ట్యాబ్‌లు అందజేశారు. మండలంలోని 57 పాఠశాలలు, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, 64 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 ఏళ్ల లోపు విద్యార్థులు 8560 మందికి మాత్రలు మింగించాలని ఆయన అన్నారు.

పూసపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం



వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని పూసపాడు గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యిబిరంలో 406 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 122 మందికి కంటి పరీక్షలు, 284 మంది బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు నిర్మల, వైష్ణవి, అంజలి, సుధాకర్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచ్ పోలూరి రమాదేవి, కార్యదర్శి వేమవరపు సురేష్ బాబు, ఏఎన్‌ఎం ఆదిమ్మ, సీహెచ్‌ఓ నాగలక్ష్మి, 104 డీఈఓ గోపీకృష్ణ, వినీత్, పైలెట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి సహకరించాలి



వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

అద్దంకి రూరల్: అద్దంకిలోని విశ్వబ్రాహ్మణ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వ నిధులు కేటాయించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు సంఘ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. త్వరిగతిన పరిష్కరించాలని కోరారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించండి



బల్లికురవ పాఠశాలలో హెచ్‌ఎంతో మాట్లాడుతున్న ఈదరహరిబాబు

బల్లికురవ: ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మార్చి ఉపాధ్యాయుల కొరత తీర్చినందున విద్యార్థులను తీర్చిదిద్దుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఒంగోలు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు ఉపాధ్యాయులను కోరారు. బుధవారం బల్లికురవ, పెద అంబడిపూడి ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. తాను జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్నప్పుడు పాఠశాలలు ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీలకు నిధులు కేటాయించి పనులు పూర్తిచేయించినట్లు చెప్పారు. ఇప్పుడు పాఠశాలలో అదనపు గదులు, స్మార్ట్ టీవీలు, విద్యాకానుక కిట్లు, అందజేస్తూ బోధనలో మార్పులు తెచ్చారని ఇదే మార్పులకు అనుగుణంగా ఫలితాలు కూడా పెరగాలన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులతో పాటు పదోతరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్‌లు నిర్వహించాలని కోరారు. హెచ్‌ఎం కె. హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమంచిని కలిసిన సొసైటీ అధ్యక్షుడు



ఆమంచితో గోరంట్ల సాంబశివరావు

యద్దనపూడి: యద్దనపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతుల అభివృద్ధికి సంఘ సభ్యులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. నూతన అధ్యక్షునిగా ప్రకటించిన చింతపల్లిపాడుకు చెందిన గోరంట్ల సాంబశివరావు, మెంబర్లు మానుకొండ శ్రీనివాసరెడ్డి, గుంది పుల్లారావు బుధవారం ఆమంచిని పందిళ్లపల్లిలోని స్వగృహంలో కలిశారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం



బల్లికురవలో మాట్లాడుతున్న ఈవోఆర్డీ

బల్లికురవ: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోఆర్డీ దాసరి సుమతి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తడి, పొడి చెత్తను, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి చెత్తనుంచి సంపద కేంద్రాలకు చేర్చాలన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ మాజీ సర్పంచ్ బుల్లెయ్య మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దారని చెప్పి అందరికీ పరిచయం చేశారు.

10న ఈశ్వరీ దేవి మఠం పీఠాధిపతి అద్దంకి రాక

అద్దంకి రూరల్: అద్దంకి కాకాని పాలెంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి వారి దేవస్థాన కమిటీ ఆహ్వానం మేరకు ఈనెల 10న ఈశ్వరీదేవి మఠం పీఠాధిపతి వీర శివ కుమారస్వాములు అద్దంకి రానున్నట్లు దేవస్థాన ధర్మకర్త ఉండవల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం దేవస్థానంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతు సుబ్బారావు, పొన్నపల్లి బ్రహ్మానందం, చెన్నుపల్లి శ్రీనివాసచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, మిద్దెబోయిన ఆంజనేయులు, ఏలూరు వీరబ్రహ్మం, విరాట్ కంప్యూటర్స్ కాలేషా, కొండముది రమేష్ పాల్గొన్నారు.